సాక్షి ఒడిశా

గురువారం । 2 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,75,881లు, బంగారం 1 గ్రాము 200 మిల్లీగ్రాములు, 38 గ్రాములు 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గిరిజనుల సంక్షేమానికి కృషి

గిరిజనుల సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ సర్కార్ కృషి చేస్తోందని కేంద్ర జల విద్యుత్, గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి విశ్వేశ్వర టుడు అన్నారు.

- 8లో.



చట్టాలపై అవగాహన

జయపురం కోర్టు ఆవరణలో అత్యాచార నిరోధక, పలు మహిళా చట్టాలపై బుధవారం అవగాహన శిబిరం నిర్వహించారు.

- 8లో.

న్యూస్‌రీల్

నాటుసారా బట్టీలపై దాడులు



సీజ్ చేసిన సారా తయారీకి వినియోగించే సామగ్రి

అరెస్టైన నిందితుడు కైలాస చౌదరి

జయపురం: ఎన్నికల సమయంలో నాటుసారా ఉద్ధృతిని అడ్డుకునేందుకు ఎక్సైజ్ అధికారులు, పోలీసులు విస్తృతంగా దాడులు చేపడుతున్నారు. దీనిలో భాగంగా జయపురం సమితి ఉమ్మిరి ప్రాంతంలో దొంగతనంగా నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఉమ్మిరి సమీపంలోని కొలాబ్ సాగునీటి కెనాల్ ప్రాంతంలో చట్టవిరుద్ధంగా నాటుసారా తయారు చేస్తున్న బట్టీలపై దాడులు జరిపి, 40 లీటర్ల నాటుసారాతో పాటు, నాటుసారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన రెండు వేల లీటర్లకు పైగా బెల్లంఊటను పట్టుకున్నారు. అలాగే ఉమ్మిరి గ్రామంలో నాటుసారా అమ్ముతున్న కైలాస చౌదరిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి వెల్లడించారు.

భద్రత కట్టుదిట్టం



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

బరంపురం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న తరుణంలో గంజాం జిల్లా బంజనగర్-నయగడా సరిహద్దు 59వ జాతీయ రహదారిలో పోలీసు యంత్రాంగం భద్రత కట్టుదిట్టం చేశారు. బంజనగర్ నుంచి నయగడా జిల్లా సరిహద్దు 59వ జాతీయ రహదారి గ్యాలరీ జంక్షన్‌లో గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీనా ఆదేశంతో బెటాలియన్ పోలీసుల బృందం పూర్తి నిఘా ఉంచి అర్ధరాత్రి వరకు వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా సోదాలు చేస్తున్నారు. అనుమానం గల వాహనాలను దగ్గరున్న పోలీసుస్టేషన్‌కి తరలిస్తున్నారు. ఇదేవిధంగా వారంట్ ఉన్నవారిని అరెస్టు చేసి జైలుకి తరలిస్తున్నారు.

6 ద్విచక్ర వాహనాలు సీజ్



అరెస్టైన నిందితులు, సీజ్ చేసిన బైక్‌లు

బరంపురం: స్థానిక పోలీసులు వివిధ ప్రాంతాల్లో దాడులు చేపట్టి 6 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. సదర్ ఎస్‌డీపీవో బిష్ణు ప్రసాద్ పాత్రో తెలిపిన వివరాల మేరకు.. బరంపురం పోలీసు జిల్లా పరిధిలో కొద్దిరోజుల నుంచి వివిధ ప్రాంతాల్లో పోలీసులు దాడులు జరిపారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాలు చోరీకి పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 6 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో గోపాల్‌పూర్‌కి చెందిన శంకర్ సెఠి, ఆర్.ప్రవీణ్‌రెడ్డి, ఎస్.శివశంకర్ రెడ్డిలుగా గుర్తించారు.

ముమ్మరంగా కొండబాబు ప్రచారం



మహిళలకు కరపత్రాలను అందిస్తున్న కొండబాబు

రాయగడ: ఇటీవల పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారనే ఆరోపణలపై బీజేడీ నుంచి బహిష్కరణకు గురైన ఎల్ల కొండబాబు మరలా ఆ పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. రాయగడ శాసనసభ నుంచి బీజేడీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అనసూయా మాఝిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. సమితి పరిధిలోని కొంధొ మల్లిగాం, కొత్తపేట, వీరనారాయణపూర్ తదితర గ్రామాల్లో ఆయన మద్దతుదారుతో మంగళవారం సాయంత్రం పర్యటించారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేడీ పార్టీని గెలిపించాలని అభ్యర్థించారు. గత రెండు దశాబ్దాలుగా అధికారంలో ఉన్న నవీన్ పట్నాయక్ ప్రభుత్వం, ప్రజల సంక్షేమమే పరమావధిగా పనిచేసిందన్నారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలు మహిళల ఆర్థిక సాధికారతకు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆయన హయాంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని వివరించారు. ఈసారి ఎన్నికల్లో రాయగడ శాసనసభ నుంచి పోటీ చేసేందుకు ఒక మహిళకు అవకాశం కల్పించారని, ఆమెను గెలిపించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం పార్టీ కరపత్రాలను గ్రామస్తులకు పంచిపెట్టారు.

జయపురంలో.. రసవత్తర పోరు

- బరిలో 11 మంది అభ్యర్థులు
- బీజేడీ, కాంగ్రెస్, బీజేపీల మధ్యే త్రిముఖ పోరు



జయపురం: జయపురం (జనరల్) నియోజకవర్గంలో బహుముఖ పోటీ జరగనుంది. ఈ పోటీలో 11 మంది తలపడుతున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కొరాపుట్ జిల్లాలో అనేక పోరాటాలు జరిపిన కాంగ్రెస్.. ఒడిశా రాష్ట్రం ఏర్పడక ముందు, దేశ స్వాతంత్ర్యం రాక ముందు జరిగిన ఎన్నికల్లో ఘన విజయాలు సాధించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1951, 1957 ఎన్నికల్లో ఘోర పరాజయం ఎదురైంది. 1951లో జయపురం రాజులు పోటీలో ఉండగా.. గణతంత్ర పరిషత్ మొదటి రెండు ఎన్నికల్లో విజయ ఢంకా మోగించింది. 1951లో మొదటి సాధారణ ఎన్నికలు జరిగాయి. కొరాపుట్ జిల్లాలో 9 శాసన సభస్థానాలతోపాటు జయపురం, నవరంగపూర్ నియోజకవర్గాలు ఉండేవి. వీటిలో ఐదు ఎస్టీలకు, ఐదు జనరల్, ఒక స్థానం ఎస్సీలకు రిజర్వ్ చేశారు. జయపురం నియోజకవర్గంలో రెండు ఎమ్మెల్యే స్థానాలు ఉండేవి. ఒకటి జనరల్, మరోకటి ఎస్సీలకు కేటాయించారు.

కాంగ్రెస్ అభ్యర్థుల విజయ ప్రస్థానం..

- 1951 లో జరిగిన ఎన్నికల్లో ఈ రెండు స్థానాలను గణతంత్ర పరిషత్ అభ్యర్థులు హరిహర మిశ్ర (జనరల్), లైచన్ నాయక్(ఎస్సీ) గెలిపొందారు.
- 1957లో కూడా వీరిద్దరు గణతంత్ర పరిషత్ అభ్యర్థులుగా పోటీ చేసి రెండో సారి విజయం సాధించారు.
- 1961 ఎన్నికల నుంచి రాజకీయ పరిస్థితి మారిపోయింది. 1961లో కాంగ్రెస్ అభ్యర్థి రఘునాథ్ పట్నాయక్ గెలుపొందారు.
- 1967లో తెలుగు అభ్యర్థిని ప్రజలు ఆదరించారు. రాయగడకు చెందిన పారిశ్రామిక వేత్త ఎస్.రామశేషయ్య స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఈయనకు రాష్ట్ర మంత్రి మండలిలో స్థానం లభించింది.
- 1971లో జయపురం రాజ కుటుంబీకులు ప్రతాప్ నారాయణ సింగ్ దేవ్ స్వతంత్రపార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు.
- 1974 నుంచి 1995 వరకు జరిగిన 6 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ వరుస విజయాలు సాధించింది.
- 1985 ఎన్నికలో తప్ప.. మిగిలిన 5 ఎన్నికల్లోనూ రఘునాథ్ పట్నాయక్ గెలిపొందారు. మంత్రి వర్గంలో ఆర్థిక, న్యాయ విభాగాల మంత్రిగా ఉంటూ రెండో స్థానంలో ఉండేవారు. ఒక దశలో ఈయన ముఖ్యమంత్రి అవుతారన్న ప్రచారం జరిగింది.
- 1985లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గుప్త ప్రసాద్ దాస్ 71.2 శాతం ఓట్లు పొంది రికార్డు సృష్టించారు. ఈ ఎన్నికలో 45,384 ఓట్లు పోల్ అవ్వగా.. 31,058 ఓట్లు పొందారు.
- 1990, 1995 ఎన్నికల్లో రఘునాథ్ పట్నాయక్ (కాంగ్రెస్) గెలుపొందారు.

నవీన్ పట్నాయక్ అరంగేట్రం..

- ఒడిశాలో నవీన పట్నాయక్ నేతృత్వంలో అవతరించిన బీజేడీ ప్రభావం 2000 ఎన్నికల్లో జయపురంలో పడింది. ఆ నాడు బీజేడీ అభ్యర్థిగా రబినారాయణ నంద విజయం సాధించారు.
- 2004, 2009లలో గెలిపొంది హ్యాట్రిక్ సాధించారు. ఆయన కూడా నవీన పట్నాయక్ మంత్రివర్గంలో పలు పదవులు నిర్వహించారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం..

- 2014, 2019 ఎన్నికల్లో రబినారాయణ నందోను ఓడించి తిరిగి కాంగ్రెస్ విజయం సాధించి తన పూర్వ స్థానాన్ని దక్కించుకొంది. ఆ రెండు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థి తారాప్రసాద్ బాహిణీపతి. 2024లో జరుగుతన్న ఎన్నికల్లో మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధించాలన్న లక్ష్యంతో పోటీ పడుతున్నారు. ఈ ఎన్నికల్లో బీజేడీ పార్టీ మహిళకు టికెట్టు ఇచ్చింది. ఈమె మాజీ మంత్రి రబినారాయణ నంతో సతీమణి ఇందిరా నందో. భర్తను రెండు సార్లు ఓడించిన తారాప్రసాద్‌కు చెక్ పెట్టాలన్న పట్టుదలతో ఈమె ఉన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో మరోసారి గౌతమ్ సామంతరాయ్ కూడా విజయ లక్ష్యంతో పావులు కదుపుతున్నారు. బహుజన పార్టీ అభ్యర్థిగా సరోజ్ కుమార్ నాయిక్, ఆమ్ ఆద్మీ అభ్యర్థిగా గౌరీచరణ్ దేవశర్మ. అఖిల భారత హిందూ మహాసభ అభ్యర్థిగా మహేంద్ర కుమార్ పాత్రో, ఆల్‌ఇండియ ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా బి.హరిరావుతోపాటు మరో నలుగురు ఇండిపెండెంట్లు ఎన్నికల బరిలో ఉన్నారు. 11 మంది పోటీలో ఉన్నా.. ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేడీ, బీజేపీ అభ్యర్థుల మధ్యేనని రాజకీయ పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు. తారా ప్రసాద్ బాహిణీపతి విజయాన్ని అడ్డుకోవడం అంత తేలిక కాదని రాజకీయ పరిశీలకుల అభిప్రాయం.

ఎవరూ భయపడొద్దు



కోవిషీల్డ్ టీకాలు

- రాష్ట్రంలో టీటీఎస్ ఛాయలు లేవు
- డాక్టర్ బిజయ్ పాణిగ్రాహి

భువనేశ్వర్: కోవిషీల్డ్ టీకాల యొక్క దుష్ప్రభావంగా పేర్కొంటున్న థ్రాంబోసిస్ థ్రాంబో సైటోపెనియా సిండ్రోమ్ (టీటీఎస్) రాష్ట్రంలో ఇంకా బయటపడలేదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రజలకు హామీ ఇచ్చింది. టీకా వేసుకున్న మూడు వారాల వ్యవధిలో సాధారణంగా దుష్ప్రభావాలు బయటపడతాయి. రాష్ట్రంలో కోవిషీల్డ్ వ్యాక్సిన్ డ్రైవ్ ప్రారంభించి మూడు సంవత్సరాలు గడిచింది. ఈ తరుణంలో దుష్ప్రభావాలు వెలుగు చూసే అవకాశం లేదని రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ కోవిడ్ వ్యాక్సినేషన్ డైరెక్టర్ డాక్టర్ బిజయ్ పాణిగ్రాహి తెలిపారు.

టీటీఎస్ లక్షణాలు ఇవే..

టీటీఎస్ అనేది రక్తం గడ్డకట్టడానికి అవసరమైన తక్కువ స్థాయి ప్లేట్‌లెట్‌లతో (థ్రోంబోసైటోపెనియా) మెదడులో (సెరిబ్రల్ వీనస్ సైనస్ థ్రాంబోసిస్), పొత్తికడుపులో రక్తం గడ్డకట్టడం (థ్రాంబోసిస్) వల్ల ఏర్పడుతుంది. తీవ్రమైన, నిరంతర తలనొప్పి, అస్పష్టమైన దృష్టి, శ్వాస ఆడకపోవడం, ఛాతి నొప్పి, కాళ్లలో వాపు, కడుపు నొప్పి, సులభంగా గాయాలు, చర్మం కింద చిన్న రక్తపు మచ్చలు టీటీఎస్ యొక్క లక్షణాలుగా పేర్కొన్నారు. దేశంలోని సీరమ్ ఇన్‌స్టిట్యూట్ భాగస్వామ్యంతో కోవిడ్ 19 వ్యాక్సిన్ కోవిషీల్డ్‌ను విక్రయించిన ఫార్మా కంపెనీ ఆస్ట్రాజెనెకా యునైటెడ్ కింగ్‌డమ్ ఉన్నత న్యాయస్థానంలో దుష్ప్రభావాల నివేదికలు ప్రవేశపెట్టడంతో దేశ వ్యాప్తంగా ప్రజల్లో భయం పెరిగింది. ఆరోగ్య అధికారుల సమాచారం ప్రకారం కోవిడ్ 19 వ్యాక్సిన్ డ్రైవ్‌ను ప్రారంభించినప్పటి నుంచి ఒడిశాలో సుమారు 6.42 కోట్ల డోస్‌ల వ్యాక్సిన్‌ను సరఫరా చేశారు. మేము టీటీఎస్ గురించి తెలుసుకున్నాం. దుష్ప్రభావాలకు సంబంధించి భారత ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. దుష్ప్రభావాల సంభావ్యత ఒక మిలియన్ మోతాదుకు 0.61 మాత్రమే అని డాక్టర్ బిజయ్ పాణిగ్రాహి వివరించారు.

మహిళ దారుణ హత్య



గుడిసె వద్ద దర్యాప్తు చేస్తున్న పోలీసులు



బారొకేసి హుయిక మృతదేహం

రాయగడ: జిల్లాలో కల్యాణ సింగుపూర్ సమితి పూజారిగుడ పంచాయతీలోని రేఖాలిగుడ గ్రామానికి చెందిన బారొకేసి హుయిక (55) అనే ఆదివాసీ మహిళ మంగళవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యింది. ఆమెను హత్య చేసిన గుర్తు తెలియని దుండగులు రెండు తులాల బంగారు ఆభరణాలను దొంగిలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రేఖాలిగుడలో నివసిస్తున్న బారొకేసి అనే ఆదివాసీ మహిళ తన గ్రామానికి సమీపంలోని రాయిగుడ అటవీ ప్రాంతంలో ఉన్న కొంత పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతోంది. ఈ నేపథ్యంలో పొలం వద్ద చిన్న గుడిసెను ఏర్పాటు చేసుకుని పంట పొలాలను కాపలాకాసుకుంటూ రాత్రి సమయానికి ఇంటికి చేరేది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వరకు ఆమె ఇంటికి చేరకపోవడంతో, ఆమె తమ్ముడు జగ్గారావు హుయిక బుధవారం పంటపొలం వద్ద గుడిసెలోకి వెళ్లి చూడగా అక్కడ బారొకేసి శవమై పడి ఉంది. విషయాన్ని గ్రామస్తులకు తెలియజేయడంతో పాటు పోలీసులకు ఆయన సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16 లోక్‌సభ, 28 అసెంబ్లీ స్థానాలకు ఎస్‌సీసీయూ పోటీ



విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఎస్‌సీసీయూ ప్రతినిధులు

జయపురం: రాష్ట్రంలోని 16 లోక్‌సభ, 28 అసెంబ్లీ స్థానాలకు సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, కొరాపుట్ జిల్లా కార్యదర్శి కనూ బిశ్వాల్ వెల్లడించారు. జయపురంలోని రెంవడ దైనిక బజారులోని కార్మిక భవనంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవిభక్త కొరాపుట్‌లోని నవరంగపూర్, కొరాపుట్ లోక్‌సభా స్థానాలలో తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టిందన్నారు. అలాగే కొరాపుట్ అసెంబ్లీ స్థానంలో కూడా అభ్యర్థిని నిలిపినట్లు వెల్లడించారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలో ఎస్‌సీసీయూ (కమ్యూనిస్టు) పార్టీ గత 40 ఏళ్ల నుంచి నిరుపేదల, కార్మికుల, దారిద్ర్య రేఖ కిందనున్న అభాగ్యుల జీవన సమస్యలు, వారి హక్కుల కోసం పోరాటాలు సాగిస్తోందన్నారు. ఉద్యోగుల కొత్త పెన్షన్ చట్టాలను రద్దు చేసి పాత చట్టాలనే అమలు చేయాలని, జోరుగా సాగుతున్న మాదక ద్రవ్యాల వ్యాపారాన్ని నిలిపివేయాలని తమ పార్టీ ఎంతో కాలంగా పోరాటం చేస్తుందన్నారు. ప్రజల కొరకు పోరాటాలు సాగిస్తున్న తమ పార్టీ గుర్తు రంపంపై ప్రజలు ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్‌సీసీయూ మహిళా నాయకురాలు ఇందుమది దాస్, ప్రముఖ కార్మిక నేత, పార్టీ సీనియర్ నాయకుడు సుభాష్ భట్టాచార్య, రవీంద్ర పండ, ప్రశాంత పండ, జగన్నాథ్ హరిజన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు రఘునాథ్ గుడ్ బై

రాయగడ: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఎన్నికల బరిలో ఉన్నవారు ప్రచారంలో దూసుకుపోతుండగా, మరోవైపు అసంతృప్త నాయకుల రాజీనామాలు పార్టీల అధిష్టానాలకు తలనొప్పులు తీసుకొస్తున్నాయి. ఈ క్రమంలోనే జిల్లాలో గుణుపూర్ శాసనసభ నియోజకవర్గంలో ముసలం కనిపిస్తోంది. ఈ ప్రాంతానికి చెందిన సీనియర్ నాయకుడు రఘునాథ్ పాత్రో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. తన రాజీనామ పత్రాన్ని పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్‌కు బుధవారం పంపించారు. ఇప్పటికే గుణుపూర్‌కు చెందిన అవినాష్ గొమాంగో వంటి యువ నాయకులు పార్టీకి రాజీనామా చేయడంతో, పార్టీ బలం మరింత తగ్గుముఖం పట్టిందనడంలో అతిశయోక్తి లేదు. అదేతరహాలో డీసీసీ అధ్యక్షుడు బిజయ్ గొమాంగో కూడా పార్టీ కార్యకలాపాలకు దూరంగానే ఉంటున్నారు. ఎన్నికల ప్రచారంలో అసలు ఆయన పాల్గొనడం లేదు. ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సత్యజీత్ గొమాంగోకు అధిష్టానం టిక్కెట్టు కేటాయించి, పార్టీ టిక్కెటు ఆశించిన బిజయ్ తనయుడికి మొండి చెయ్యి చూపించింది. దీంతో బిజయ్ పార్టీకి దూరంగా ఉంటూ తన అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

బీజేడీ పాలనలో రాష్ట్రం అధోగతి



సమావేశంలో మాట్లాడుతున్న డాల్వి, పక్కనే సప్తగిరి, అప్పలస్వామి తదితరులు

- ఖనిజ సంపదలు ప్రైవేట్ సంస్థలకు తాకట్టు
- ఏఐసీసీ సాధారణ కార్యదర్శి రవీంద్ర డాల్వి



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయగడ: గత కొన్నేళ్లుగా బీజేడీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలయ్యిందని ఏఐసీసీ సాధారణ కార్యదర్శి రవీంద్ర డాల్వి ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బుధవారం ఆయన రాయగడ విచ్చేశారు. ఈ మేరకు స్థానిక తేజస్వీ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండు దశాబ్దాలుగా ఎటువంటి అభివృద్ధి జరగలేదని మండిపడ్డారు. ఒడిశా రాష్ట్రం ఖనిజ, ప్రాకృతిక సంపదలకు నిలయమని, అటువంటి సంపదలను రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు తాకట్టు పెట్టిందని దుయ్యబట్టారు. ఇటువంటి ప్రభుత్వానికి మరో అవకాశం కల్పించకూడదని మండిపడ్డారు. ఖనిజ సంపదలను సక్రమంగా సద్వినియోగపరుచుకుంటే రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి చెంది ఉండేదని, అదేవిధంగా నిరుద్యోగ సమస్య దూరమయ్యేదని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

ఈసారి జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్వ వైభవం వస్తుందని డాల్వి ధీమా వ్యక్తం చేశారు. బీజేడీ పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారని, ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తున్నాయని వెల్లడించారు. ఈనెల 3వ తేదీన ఏఐసీసీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ రాయగడలో పర్యటించి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని తెలియజేశారు. ఈ జిల్లాతో గాంధీ కుటుంబానికి ఎంతో అవినవభావ సంబంధాలు ఉన్నాయన్నారు. అప్పటి దివంగత ప్రధాని ఇందిరా, రాజీవ్‌గాంధీలు ఈ జిల్లాలో పర్యటించి ఆదివాసీల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఇదేతరహాలో ఈసారి రాయగడలో రాహుల్ గాంధీ పర్యటన అనంతరం ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాహుల్‌తో పాటు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వంటి నాయకులు ఈ ఎన్నికల ప్రచారానికి రానున్న నేపథ్యంలో, సభను అంతా కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఒడిశా కాంగ్రెస్ ఇన్‌చార్జి సహనావబ్ చౌదరి, కొరాపుట్ లోక్‌సభ ఎంపీ అభ్యర్థి సప్తగిరి ఉలక, రాయగడ శాసనసభ నియోజకవర్గం అభ్యర్థి అప్పలస్వామి కడ్రక, పీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించారు.

వడగళ్ల వాన..



వడగళ్ల వాన కురుస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రమంతటా తీవ్రమైన వేడి గాలులతో తల్లడిల్లిన ప్రజలకు బుధవారం కురిసిన వర్షంతో కొంత ఉపశమనం కలిగింది. కాల వైశాఖీ ప్రభావంతో కురిసిన కొద్దిపాటి వర్షం జంట నగరాలు భువనేశ్వర్, కటక్, పొరుగు ప్రాంతాల వాసులకు ఊరటనిచ్చింది. అక్కడక్కడ వడగళ్ల వాన కురిసింది. కటక్ జిల్లా అఠొగొడొ, బంకి, నరసింగ్‌పూర్, బొడొంబా ప్రాంతాల్లో వర్షం, వడగళ్ల వాన కారణంగా అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. విమానయానం ప్రభావితం అయింది. దక్షిణ కోసా, ఉత్తర కోసా, రాయగడ, గజపతి, ఢెంకనాల్, మయూర్‌భంజ్, బాలాసోర్, కేంద్రాపడా, కటక్, నయాగడ్, దక్షిణ మారు మూల జిల్లాల్లో రానున్న 24 గంటల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ భువనేశ్వర్ శాఖ డైరెక్టర్ మనోరమ మహంతి తెలిపారు.

పగటి ఉష్ణోగ్రత కొద్దిగా తగ్గవచ్చు..

వర్షం కురిసే ప్రదేశాలలో పగటి ఉష్ణోగ్రత కొద్దిగా తగ్గవచ్చు. వడగాలుల పరిస్థితులు కొనసాగుతాయి. ఈ నెల 2న రెడ్ అలర్ట్, మే 3, 4 తేదీల్లో ఆరెంజ్ అలర్ట్, మే 5న ఎల్లో అలర్ట్ ప్రకటించామని మనోరమా మహంతి తెలిపారు. మే 5 తర్వాత పగటి పూట ఉష్ణోగ్రత 2 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉందని ఆమె తెలిపారు. బుధవారం ఉదయం 11.30 గంటలకు 5 చోట్ల 40 డిగ్రీల సెల్సియస్ పైబడి ఉష్ణోగ్రత నమోదైంది.

40 డిగ్రీల సెల్సియస్, అంతకంటే పైబడి ఉష్ణోగ్రత నమోదైన ప్రదేశాల్లో ఉష్ణోగ్రత వివరాలు.

స్థలం	ఉష్ణోగ్రత (డిగ్రీలు సెల్సియస్)
ఝార్సుగుడ	41.3
భువనేశ్వర్	41.2
సంబలపూర్	40.6
హిరాకుద్	40.4
కెంజొహర్	40.0



వడగళ్ల వాన తాకిడితో దెబ్బతిన్న విస్తారా విమానం



విమానం పరిస్థితిని సమీక్షిస్తున్న నిపుణుల బృందం

భువనేశ్వర్: భువనేశ్వర్ నుంచి ఢిల్లీకి బయల్దేరిన విస్తారా విమానం టేకాఫ్ అయిన వెంటనే స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. ప్రాథమిక సమాచారం ప్రకారం బుధవారం మధ్యాహ్నం రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వాతావరణంలో మార్పుచోటు చేసుకుంది. వడగళ్ల వాన కారణంగా భువనేశ్వర్ - ఢిల్లీ విస్తారా విమానం స్థానిక విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ అయింది. వడగళ్ల వాన తాకిడితో విస్తారా విమానం విండ్ షీల్డ్‌లో పగుళ్లు ఏర్పడ్డాయి. స్థానిక సాంకేతిక నిపుణులు విమానం స్థితిగతుల్ని సమీక్షిస్తున్నారు.



దెబ్బతిన్న విస్తారా విమానం విండ్ షీల్డ్

క్లుప్తంగా

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

బరంపురం: ఎండల తీవ్రత ఎక్కువకావటంతో బరంపురం ఎస్టీఆర్ సేవ సమితి ఆధ్వర్యంలో స్థానిక రామలింగేశ్వర్ మైన్ రోడ్డులో మంగళ, బుధవారాల్లో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థి వినూత్న ప్రచారం



కొత్త బస్టాండులో ట్రంపెట్‌తో ప్రచారం చేస్తున్న అమోద్ బర్ధన్

పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడి నియోజికవర్గం నుంచి పోటీచేస్తున్న స్వతంత్ర్య అభ్యర్థి, యూట్యూబ్ చానల్ జర్నలిస్టు అమోద్ బర్ధన్ వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. తనకు ఎన్నికల అధికారులు కేటాయించిన ఎన్నికల గుర్తు ట్రంపెట్ (పిప్పీ) ను వాయిస్తూ బస్టాండు, ఇతర స్లమ్ ఏరియాలలో ముమ్మరంగా ప్రచారం చేస్తూ ఆకట్టుకుంటున్నారు. బుధవారం గుమ్మా ఏజెన్సీ ప్రాంతంలో ప్రచారం చేసిన ఆయన తనను గెలిపిస్తే అవ్వతాతలకు పింఛన్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

చట్టాలపై అవగాహన



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సుమన్ జెన

జయపురం: అత్యాచార నిరోధక, పలు మహిళా చట్టాలపై బుధవారం అవగాహ శిబిరం నిర్వహించారు. జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర సూచన మేరకు జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో గల ఈ శిబిరం ఏర్పాటు చేవారు. జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారణపతి సుమన్ జెన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలు, విద్యార్థినులు, ఉద్యోగులపై జరుగుతున్న అత్యాచారలపై న్యాయం చేకూర్చేందుకు సుప్రీం కోర్టు నిర్ణయాలను, గైడ్ లైన్స్‌లను వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో విధుల నిర్వహిస్తున్న మహిళలపై తమ తోటి ఉద్యోగులు అత్యాచారాలకు పాల్పడితే బాధిత మహిళలు ఏం చేయాలి, ఇటువంటి సంఘటనలు ఎలా ఎదుర్కొవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో జయపురం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పృథ్వీరాజ్ మహాపాత్రో, అధ్యాపకులు మానసీ ఖడెంగ, వి.శ్రీదేవి, మజిమా బేగం, శాశ్చిత్ కుమార్ రథ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా చట్టాలు



ప్రసంగిస్తున్న న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి సుయన్ జెన

జయపురం: కార్మికులకు అండగా చట్టాలు ఉన్నాయని పలువురు వక్తలు అన్నారు. కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ ఆధ్వర్యంలో జయపురంలో బుధవారం కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా జడ్జి, న్యాయ సేవా ప్రదీకరణ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ మిశ్ర, కార్యదర్శి సుయన్ జెన, డిప్యూటీ చీఫ్ లీగల్ లెడ్ హరిశ్చంద్ర ముదులి తదితరులు కార్మిక దినోత్సవ ప్రాధాన్యాన్ని వివరించారు. కార్మికుల కోసం అమల్లో ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

రాయగడ: స్థానిక మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రైల్వే కాలనీలో గల సాయిబాబా మందిరం ప్రాంగణంలో బుధవారం పేదలకు దుస్తుల పంపిణీ చేశారు. పండ్లు, బిస్కెట్లు అందజేశారు. క్లబ్ అధ్యక్షురాలు కొరాడ రజిత, కార్యదర్శి కె భారతి, కొశాధికారి బి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

- కేంద్ర గిరిజన శాఖ మంత్రి విశ్వేశ్వర టుడు



కలిమెల బహిరంగ సభ వేదికపై కేంద్రమంత్రి విశ్వేశ్వర్ టుడు తదితరులు

మల్కన్‌గిరి: గిరిజనుల సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ సర్కార్ కృషి చేస్తోందని కేంద్ర జలవిద్యుత్, గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి విశ్వేశ్వర టుడు అన్నారు. మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితిలో బుధవారం బీజేపీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా భారీ రోడ్డు షో నిర్వహించారు. అనంతరం కలిమెలలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు అందకుండా చేస్తుందని ఆరోపించారు. గత ఐదేళ్లలో గిరిజనులకు అందించిన పథకాల వివరాలు చెప్పాలని బీజేడీ సర్కార్‌ను ప్రశ్నించారు. ఇక నుంచి కేంద్ర ప్రభుత్వం గిరిజనుల కోసం అందజేస్తున్న ప్రతి పథకాన్ని నేరుగా పంచాయతీలకే చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత ప్రత్యేక విమానంలో వచ్చిన కేంద్ర మంత్రి విశ్వేశ్వర్ తుడు మల్కన్‌గిరి విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో కలిమెల వెళ్లారు. ఆయనకు మల్కన్‌గిరి ఎయిర్‌పోర్టులో జిల్లా బీజేపీ అధ్యక్షుడు నిమాయి పాల్ స్వాగతం పలకగా.. మల్కన్‌గిరి ఎమ్మెల్యే అభ్యర్థి నర్సింగ్ మడ్కమి కూధ పూలగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో నవరంగ్‌పూర్ ఎంపీ అభ్యర్థి బోలభద్ర మాఝి, ఒడియా సినీనటి బిదుస్మితా, మాజీ మంత్రి ఆశోక్ పోరిడా ఉన్నారు. ఈ సందర్భంగా తామ్నా పంచాయతీకి చెందిన నాయకుడు గీతా దోమి బీజేపీలో చేరారు. అలాగే జిల్లా యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా 300 మంది మద్దతుదారులతో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. కలిమెల సమితి తనువ గ్రామం నుంచి కార్తీక్ దేవ్ నాథ్‌తో పాటు 500 మంది బీజేడీ పార్టీని వీడి బీజేపీలో చేరారు. కోరుకొండ, పద్మగిరి, పండ్రీపాణి నుంచి కూడా బీజేడీకి చెందిన 200 మంది ఆ పార్టీకి రాజీనామా చేసి భారతీయ జనతాపార్టీలో చేరారు.



సభకు హాజరైన ప్రజలు



సభలో ప్రసంగిస్తున్న ఎంపీ అభ్యర్థి బోలభద్ర మాఝి



మల్కన్‌గిరి ఎయిర్‌పోర్టు వద్ద కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న జిల్లా బీజేపీ నాయకులు

ఘనంగా మే డే



పర్లాకిమిడి: ర్యాలీలో పాల్గొన్న గజపతి జిల్లా శ్రామిక మిళిత సంఘం సభ్యులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోటార్ శ్రామిక మిళిత మహాసంఘం ఆధ్వర్యంలో మే డే సందర్భంగా కొత్త బస్టాండ్ నుంచి రాజవీధి, మార్కెట్ మీదుగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మోటార్ వర్కర్స్ శ్రామిక మిళిత మహాసంఘం అధ్యక్షుడు కోడూరు రామరాజు, ఉపాధ్యక్షుడు దానాన జగన్నాథం, ప్రధాన కార్యదర్శి నర్సింగ మాల బిశోయి, కోశాధికారి, కె.బాలరాజు, భీమారావు, రొక్కం లోకనాథం, ఎ.మోహన్‌రావు, సీపీఎం లిబరేషన్ నాయకులు శ్రీనివాస బెహరా తదితరులు పాల్గొన్నారు. కొత్త బస్టాండ్‌లో మోటారు వర్కర్స్, కళాసీల సంఘం (సీటూ) ఆధ్వర్యంలో ఎర్ర జెండా ఎగురవేసి మోటారు వర్కర్స్ సంఘం అధ్యక్షుడు నృసింహా చరణ్ పట్నాయక్, ఆదర్శదాస్ తదతరులు పాల్గొని కార్మికుల దినోత్సవం సందర్భంగా మాట్లాడారు. అనంతరం బస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహించారు.



పర్లాకిమిడి: ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల ర్యాలీ

రాయగడలో..

రాయగడ: ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపాలిటీ గాంధీ పార్క్ వద్ద ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపాలిటీ సఫాయి కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐఎన్‌టీయూసీ నాయకుడు భవానీశంకర్ జెన్న నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో పలువురు ప్రసంగించారు. కార్మికుల హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.



పర్లాకిమిడి: కొత్త బస్టాండ్ వద్ద కార్మికుల ర్యాలీ



రాయగడ: ర్యాలీలో పాల్గొన్న కార్మికులు

ప్రధాన కూడళ్లలో చల్లదనం



నాల్కో ఛక్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన పరదాలు



ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన పరదాలు

- వాహనదారుల కోసం పరదాలు ఏర్పాటు

భువనేశ్వర్: నగరంలో వాహన చోదకులకు కొద్దిపాటి ఉపశమనం కోసం స్థానిక నగర పాలక సంస్థ (బీఎంసీ) నడుం బిగించింది. రద్దీ నియంత్రణ కోసం ప్రధాన కూడలి ప్రాంతాల్లో పచ్చ సిగ్నల్ కోసం నిరీక్షించే వాహనాలు మండుటెండలో ఇబ్బంది పడుతున్నారు. ఈ వేడి సమయంలో వాహన చోదకులకు విశ్రాంతిని అందించడానికి బీఎంసీ నగరంలో ట్రాఫిక్ జంక్షన్లలో పరదాలతో తాత్కాలిక ఛాయా ప్రాంగణం ఏర్పాటు చేస్తున్నారు. ప్రారంభంలో నగరంలో రద్దీ కూడలి నాల్కో స్క్వేర్ ట్రాఫిక్ జంక్షన్ వద్ద తాత్కాలిక షెడ్ ఏర్పాటైంది. అన్ని ప్రధాన కూడళ్లలో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

బీజేడీ అభ్యర్థి పాణిగ్రాహి బైక్ ర్యాలీ



గుమ్మాబ్లాక్ ఆశ్రయగడ వద్ద బైక్ ర్యాలీ

పర్లాకిమిడి: పర్లాకిమిడి నియోజకవర్గ బీజేడీ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి భారీ బైక్ ర్యాలీని బుధవారం నిర్వహించారు. గుమ్మా బ్లాక్ తహాజంగ్ గ్రామం నుంచి కె.సి.పూర్, గుమ్మా, ఆశ్రయగడ, బోడోకోలాకోట్, సెరంగో గ్రామం వరకూ సాగిన ర్యాలీలో మాజీ ఎంపీ మున్నాఖాన్, గుమ్మా, సెరంగో బీజేడీ పార్టీ కార్యకర్తలు అధకంగా పాల్గొన్నారు.

కార్మికులది గురుతర బాధ్యత



మాట్లాడుతున్న బాహిణీపతి

జయపురం: దేశ నిర్మాణంలో మోటారు కార్మికులది గురుతరమైన బాధ్యతని స్థానిక ఎమ్మెల్యే, జయపురం నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. జయపురంలోని జైల్ రోడ్డులో ఉన్న మోటారు వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో మే డే సందర్భంగా కార్మిక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తారాప్రసాద్ బాహిణీపతి కార్మిక దినోత్సవ ప్రాధాన్యాన్ని వివరించారు. కార్మికుల శ్రమ దోపిడీని నిరోధించి వారి హక్కుల రక్షణకు చికాగో నగరంలో కార్మికులు ఉద్యమించిన రోజునే మే డేగా ఒకటో తేదీన కార్మికులారా ఏకంకండి నినాదంతో జరుపుకుంటున్నామన్నారు. కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలు అవసరమన్నారు. కార్మికులంతా ఒకేతాటిపై నిలబడాలన్నారు. అనంతరం మోటారు కార్మికుల సమస్యలపై వారితో చర్చించారు. జయపురం మున్సిపల్ చైర్మన్, జయపురం లారీ ఓనర్స్ నేత నరేంద్రకుమార్ మహంతి, దేవేంద్ర బాహిణీపతి మాట్లాడారు. ముందుగా కార్మిక పతాకాన్ని ఎమ్మెల్యే బాహిణీపతి ఎగురవేశారు.



మోటారు కార్మికుల సమస్యలపై చర్చిస్తున్న బాహిణీపతి

విదేశీ మద్యం స్వాధీనం



బీరు బాటిళ్లతో నిందితుడు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతి పుహండి కూడలిలో ఎక్సైజ్ శాఖ అధికారులతో పాటు ఎలక్షన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్కాడ్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన దాడుల్లో 23.400 లీటర్ల విదేశీ మద్యం స్వాధీనం చేసుకుని సంబంధించి ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి టికిరి పరిధిలోని మంకడజోల గ్రామానికి చెందిన భిభూతి సగాడియా (30)గా గుర్తించారు. దాడుల్లో కాసీపూర్ బీడీవో డాక్టర్ అమృత్ రావు తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

పలాస: సమాజంలో వస్తున్న మార్పులను స్వాగతిస్తూనే యువత సన్మార్గంలో నడవాలని పలువురు వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. మండలంలోని మాకన్నపల్లి గ్రామంలో ఆ గ్రామానికి చెందిన సూర్యోదయ యువజన సంఘం 28వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. యూటీఎఫ్ నాయకుడు బి.ఓంకార్ అధ్యక్షతన 'సమాజం -నాడు నేడు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రముఖ జానపద పరిశోధకుడు, గిడుగు రామ్మూర్తి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రి కూర్మారావు, ప్రముఖ కవి బమ్మిడి సుబ్బారావు, విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.వల్లభరావు ప్రసంగిస్తూ గత 40 ఏళ్లలో సమాజంలో అనేక రంగాల్లో మార్పులు సంభవించాయని వివరించారు. ముఖ్యంగా వ్యవసాయం, విద్య, వైద్యం, వాతావరణం, ఆచార సాంప్రదాయాలు వంటి రంగాల్లో చాలా మార్పులు జరిగాయన్నారు. అయితే ఈ వచ్చిన మార్పులను స్వాగిస్తూనే సరైన మార్గంలో నడుచుకొని భావితరాలకు మంచి బాటలు వేయాలని కోరారు. అనంతరం జల్లాస్థాయి డాన్స్ బేబీ డాన్స్ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో యువజన నాయకులు తెప్పల షణ్ముఖరావు, గేదెల దిలీప్, తెప్పల లోకనాథం, మల్లేన అశోక్, జుత్తు కిషోర్, గ్రామ పెద్దలు నీలకంఠం, తెప్పల అప్పలస్వామి, మేడిస అప్పలస్వామి, తెప్పల అజయ్‌కుమార్, లక్ష్మి, ఊర్వశి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ

ఇచ్ఛాపురం: ఈనెల 13వ తేదీన జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో పీవోలు, ఏపీవోలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) సుదర్శన్‌దొర పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో రెండు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు.

బీజేపీ అభ్యర్థుల ముమ్మర ప్రచారం



అడవలో ప్రచారం చేస్తున్న మోహానా నియోజకవర్గ అభ్యర్థి ప్రశాంత్ మల్లిక్



కాశీనగర్ ఎన్ఏసీలో ప్రచారం చేస్తున్న నారాయణ రావు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహానా నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ప్రశాంత్ మల్లిక్ జోరుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. అడవ, ఖరిగుడ, పిండిగి గ్రామాల్లో బుధవారం విస్తృతంగా పర్యటించి ప్రచారం చేశారు. ఆయనకు ప్రజల్లో ఆదరణ పెరుగుతుంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దాశరథి గోమాంగో చేతిలో ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో తిరిగి మోహానా నియోజికవర్గం నుంచి పోటీ చేస్తూ ముమ్మరంగా మోదీ ఆరు పథకాలను ప్రచారం చేస్తున్నారు. అలాగే పర్లాకిమిడి నియోజకవర్గం కాశీనగర్ ఎన్ఏసీలో బీజేపీ అభ్యర్థి కోడూరు నారాయణరావు ఇటీవల పార్టీలో చేరిన చైర్మన్ ఎం.సుధారాణి, రొక్కం సతీష్‌తో కలిసి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన ఆరు పథకాలను కోడూరు నారాయణరావు కాశీనగర్ ప్రాంతంలో ప్రచారం చేస్తూ ఓటర్లను కలుస్తున్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- మందసలో ఎన్నికల ప్రచారం



మకరజోలలో స్థానికులతో మాట్లాడుతున్న డాక్టర్ సీదిరి అప్పలరాజు



వంతెన వద్ద ప్రజలతో నడుస్తున్న మంత్రి సీదిరి

కాశీబుగ్గ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలంలో ఎన్నికల ప్రచారం బుధవారం నిర్వహించారు. గత ఐదేళ్లలో పలాస నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని తెలియజేశారు. ఇన్నేళ్లలో గొతు కుటుంబం చేయని అభివృద్ధి పనులు, కేవలం ఐదేళ్లలోనే చేసి చూపించామని పేర్కొన్నారు. అనంతరం మకరజోల, అల్లిమెరక, గుడ్డిభద్ర, చిన్నసువర్ణపురం, నాతుపురం, సువర్ణపురం, పూజానగర్, చిన్నకేశుపురం, చిన్ననారాయణపురం, నారాయణపురం, మల్లెనవానిపేట, పెద్దకేశుపురం, జగన్నాథపురం, శ్రీరాంనగర్, తిమ్మల బిడిమి, బిడిమి, కొత్త బిడిమి, టి.గంగువాడ, రాంపురం గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లువేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పిరియా విజయ

- వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం అభ్యర్థి పిరియా విజయ

సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ కోరారు. పట్టణంలోని కళాసీ సంఘ భవనంలో శ్రీలోకనాథేశ్వర కళాసీ సంఘ సభ్యులతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేశారన్నారు. ఈ ఐదు సంవత్సరాల్లో బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందజేసి, వారి ఆర్థికాభివృద్ధికి అడుగులు వేశారని తెలిపారు. పేదల కోసం నిరంతరం ఆలోచించే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలని సిబ్బందిని, వైద్యులను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, ఎంపీటీసీ పొడుగు కామేష్, తోట ఢిల్లీరావు, జక్కం రమేష్, సంగారు గోవిందు, కళాసీ సంఘ ప్రతినిధులు రెల్ల లోకనాథం, పొందూరు తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఇచ్ఛాపురం: ప్రజా సమస్యల పరిష్కారమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని పిరియా విజయ అన్నారు. పురపాలక సంఘం పరిధి బెల్లుపడ కాలనీలో ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలకు మేలు జరగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి, మాజీ డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సల్లా సుగుణ, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, జేసీఎస్ అధ్యక్షుడు సాలిన ఢిల్లి, వార్డు కౌన్సిలర్లు గువ్వాడ ప్రదీప్, ప్రేమ్‌కుమార్, పి.మధుమూర్తి, బి.జగన్, పి.తేజేశ్వరరావు, నీలాపు లక్ష్మి, సీహెచ్ జగన్నాయకులు, తాడి ఆదిరెడ్డి, పార్టీ నేతలు పిలక సంతు, చాట్ల తులసీదాస్, పిలక విజయ్‌భాస్కర్, సీహెచ్ తిరుపతి, నీలాపు ఢిల్లి, కాళ్ల సత్యం, బి.త్రినాథ్, సల్లా దేవరాజు, టింక లోకేష్, గాంధీ, ఆశి శ్రీను, ఎండీ షఫీ, కిరణ్‌బెహర తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆరో వార్డులో కౌన్సిలర్ పరపటి మంజులతా ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో పరపటి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో ప్రచారం నిర్వహిస్తున్న పిరియా విజయ

- సంక్షేమానికి చిరునామా వైఎస్‌జగన్

కవిటి: రాష్ట్రంలో ఐదేళ్ల పాలనలో పేదల సంక్షేమానికి చిరునామాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలిచారని పిరియా విజయ అన్నారు. ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి గొర్లెపాడు పంచాయతీ పరిధిలోని గ్రామాలు, కొజ్జిరియా సచివాలయం పరిధిలోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నవరత్నాల పథకాలతో ఏవిధంగా మేలు జరిగిందో వివరించారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, పీఏసీఎస్ చైర్మన్ నర్తు నరేంద్ర యాదవ్, దేవరాజు సాహు, వై.సీలయ్య, మామిడి తులసయ్య, నర్తు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

నేటి నుంచి వేట నిషేధ భృతి లబ్ధిదారుల ఎన్యూమరేషన్



అరసవల్లి: జిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో వేట నిషేధ కాలానికి భృతి అందించేందుకు అర్హుల గుర్తింపు కోసం గురువారం నుంచి ఎన్యూమరేషన్ ప్రక్రియను చేపట్టనున్నామని జిల్లా మత్స్యశాఖాధికారి పీవీ శ్రీనివాసరావు తెలియజేశారు. ఎన్నికల కమిషన్ అనుమతితో చేపడుతున్న ఈ సర్వేలో అధికారులే స్వయంగా తీర ప్రాంత మండలాల్లో అర్హులను రేషన్ కార్డుల ఆధారంగా గుర్తిస్తారని, అర్హులందరికీ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార భరోసా కింద రూ.10 వేల నగదును ఆర్థిక సాయంగా అందజేస్తుందని ప్రకటించారు. తీర ప్రాంతాల్లో సముద్రంలోకి వేటకు వెళ్లే వారంతా అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాలని కోరారు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత



శివానీ కాలేజీలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు శేఖర్ విద్యార్థి, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని ఎన్నికల పరిశీలకులు శేఖర్ విద్యార్థి అన్నారు. జిల్లాలోని పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాల ఈవీఎంలు భద్ర పర్చే స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలను జాతీయ రహదారికి అనుకొని ఉన్న చిలకపాలేం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకులు బుధవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. కౌంటింగ్ పూర్తయ్యాక బస్సుల్లో ఈవీఎంలు తరలించే విధానం, స్థానికంగా పార్కింగ్, స్ట్రాంగ్ రూంల్లో భద్రపర్చిన తర్వాత బస్సుల నిష్క్రమణ, అనంతరం స్ట్రాంగ్ రూముల్లో భద్రత వంటి వాటిపై చర్చించారు. తీసుకోబోతున్న చర్యలు, ప్రస్తుతం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పరిశీలకులకు వివరించారు. 24 గంటలు భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు, 24 గంటలు విద్యుత్ సరఫరా, ముందస్తుగా జనరేటర్ సౌకర్యం వంటి వాటిపై అధికారులు సూచనలు చేశారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్డీఓ సీహెచ్ గంగయ్య, సుడా వైస్ చైర్మన్ ఓబులేసు పాల్గొన్నారు.

ఈవీఎంల రెండో దశ ర్యాండమైజేషన్ పూర్తి



ర్యాండమైజేషన్ ప్రక్రియపై మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం, శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎం యంత్రాల రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయ్యిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు శేఖర్ విద్యార్థి సమక్షంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈవీఎంల రెండో ర్యాండమైజేషన్‌ను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులు శేఖర్ విద్యార్థి ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి దశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియ జిల్లా ఎన్నికల అధికారి సమక్షంలో, రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో జరిగిందన్నారు. మొదటి దశలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కేటాయించడం జరుగుతుందని, రెండో దశలో ఈవీఎం యంత్రాలను పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయింపు చేస్తారన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో, ఎన్నికల పరిశీలకుల పర్యవేక్షణలో ఆన్‌లైన్ విధానం ద్వారా పూర్తి పారదర్శకంగా ర్యాండమైజేషన్ పూర్తి చేశామని పేర్కొన్నారు. సమావేశంలో ఆమదాలవలస రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్‌ఓ ఎం.గణపతి రావు, శ్రీకాకుళం, నరసన్నపేట ఆర్వోలు సీహెచ్ రంగయ్య, రామ్మోహన్, ఈవీఎంల నిర్వహణ నోడల్ అధికారి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సుధ, సర్వ శిక్ష ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్.జయ ప్రకాశ్, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వతంత్ర్య అభ్యర్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాగవోలు ఆధ్యాత్మిక ప్రసంగం

విజయనగరం టౌన్: పట్టణంలోని రింగురోడ్డు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషకం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు చెందిన నాగవోలు పరమేశ్వరరావు బుధవారం అందించిన రామాయణ అనుగ్రహభాషణం అందరినీ ఆకట్టుకుంది. రామాయణంలోని వివిధ ఘట్టాలను పరమేశ్వరరావు భక్తులకు వివరించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయన్ను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కార్మిక శాఖ మంత్రి అంటే కార్మికులకు న్యాయం చేయాలి. కానీ అచ్చెన్నాయుడు రూటే సెప'రేటు'. శ్రామిక సోదరుల కోసం కొనాల్సిన మందుల్లోనూ దందా నడిపారు. వైద్యపరికరాలు ఎక్కువ ధరకు కోట్ చేసి, బినామీలను తెర మీదకు తెచ్చి, మందు బిల్లుల్లో మాయలు చేసి రూ.150 కోట్ల అక్రమానికి పాల్పడి అవినీతి మంత్రిగా ముద్ర పడ్డారు. ఈఎస్‌ఐ స్కామ్‌లో అరెస్టయ్యి జిల్లా పరువు తీసేశారు. మంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో దొరికిందే చాన్స్ అంటూ దోచుకున్నారు.

అన్నన్నా..అచ్చెన్నా
మందుల సొమ్ము ▶ మింగేశారే!

- ఈఎస్‌ఐ స్కామ్‌లో అరెస్టయిన అచ్చెన్నాయుడు
- జిల్లా పరువు తీసేసిన మంత్రిగా ముద్ర
- నకిలీ కొటేషన్లు, నకిలీ రశీదులతో రూ.150 కోట్ల మేర అక్రమాలు
- జిల్లాలోనూ అనేక దందాలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఈఎస్‌ఐ స్కామ్.. అచ్చెన్నాయుడు ఎన్నటికీ చెరపలేని అవినీతి మరక. మన జిల్లాకు చెందిన నాయకుడు రాష్ట్ర స్థాయిలో భారీ అవినీతికి పాల్పడిన వ్యవహారం మాయని మచ్చగా మిగిలిపోయింది. అధికారులను బెదిరించడం, అవసరమైతే బదిలీ చేయడం, తనకు కావల్సిన వారిని తెప్పించుకుని అక్రమాలకు పాల్పడటం టీడీపీ అధికారంలో ఉన్నంతకాలం సాగిపోయింది. అంతటితో ఆయన లీలలు ఆగలేదు. కార్మికుల కోసం కొనుగోలు చేసిన మందుల్లోనూ అవినీతికి పాల్పడ్డారు. దాదాపు రూ.150కోట్లకు పైగా జరిగిన స్కామ్‌లో సూత్రధారిగా నిలిచారు. కార్మికుల సొమ్ము కాజేసిన అచ్చెన్న బండారం విజిలెన్స్ అధికారుల విచారణలో బయటపడింది. వైద్య పరికరాలు, మందుల కొనుగోళ్ల పనులు నామినేషన్‌పై అప్పగించాలని మంత్రి హోదాలో కింజరాపు అచ్చెన్నాయుడు ఇచ్చిన సిఫారుసు లేఖతో మొత్తం గుట్టు రట్టయ్యింది. వైద్య పరికరాలు, ఔషధాలను బేరమాడి తక్కువకు కొనాల్సింది పోయి సగటున 132శాతం అధికంగా చెల్లించి కోట్లు కొట్టేశారు.

అచ్చెన్న అవినీతి మార్క్


కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో అచ్చెన్న తన మార్క్ అవినీతిని చూపించారు. ఈఎస్‌ఐ ఆస్పత్రులకు అవసరమైన మందులు, వైద్య పరికరాల కొనుగోలు కాంట్రాక్ట్‌ను తాను చెప్పిన సంస్థకు నామినేటెడ్ కట్టబెట్టాలని సంబంధిత అధికారులకు లిఖిత పూర్వగా ఆర్డర్ జారీ చేశారు. సిఫార్సుకు ముందు వారితో ఏ లాలూచీలు పడ్డారో తెలీదు గానీ తన లెటర్ హెడ్ ద్వారా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో తూచా తప్పకుండా అధికారులు పాటించారు. నామినేటేడ్‌లో కాంట్రాక్ట్ దక్కించుకున్న ఆ సంస్థ ప్రతినిధులు తర్వాత అనేక అక్రమాలకు పాల్పడ్డారు. నకిలీ ఇండెంట్లతో పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేశారు. పక్కా ఆధారాలతో ఏసీబీ అధికారులు అచ్చెన్నాయుడును అరెస్టు కూడా చేశారు.

అవినీతి జరిగిందిలా...

- రూ. 293.51కోట్ల విలువైన మందులకు కొనుగోలు కేటాయింపులు చేయగా పరిమితికి మించి రేట్ కాంట్రాక్ట్ లేని సంస్థల నుంచి ఏకంగా రూ.698.36కోట్లు విలువైన ఔషధాలు కొనుగోలు చేశారు.
- శస్త్ర చికిత్స పరికరాలకు టెండర్లు లేకుండా రూ.6.62కోట్లు మేర చెల్లించారు. వాస్తవ ధర కంటే ఇది 70శాతం అధికం.
- ఫ్యాబ్రికేటెడ్ కొటేషన్స్ సృష్టించి రేటు కాంట్రాక్టులో లేని సంస్థలకు ఆర్డర్లు ఇచ్చారు. రాశి ఫార్మా, వీరేష్ ఫార్మా సంస్థలకు కొనుగోలు ఆర్డర్ల కంటే అదనంగా రూ. 15.93కోట్లు చెల్లించారు. ఇందులో రూ.5.70కోట్లు మేర అదనంగా చెల్లించినట్టు తేలింది.
- కోట్లు వెచ్చించి కొన్న వందల పరికరాలను వినియోగించకుండా మూలనపడేశారు. జెర్సన్ ఎంటర్ ప్రైజెస్ అనే బినామీ సంస్థకు ఈఎస్‌ఐ డైరెక్టర్ డాక్టర్ సీకే రమేష్‌కుమార్ రూ. 9.50కోట్లు చెల్లించారు.
- ఒక్కో బయోమెట్రిక్ పరికరం ధర రూ.16,992 అయితే రూ.70,760చొప్పున నకిలీ ఇండెంట్లు సృష్టించి కొనుగోలు చేశారు.
- ఈ క్రమంలో రశీదులు ఫోర్జరీ చేసి కోట్లు కొల్లగొట్టారు. నకిలీ కొటేషన్లు సృష్టించి రేటు కాంట్రాక్ట్‌లో లేని సంస్థలకు ఆర్డర్లు ఇచ్చారు. ల్యాబ్ కిట్లు, ఫర్నీచర్, ఈసీజీ సర్వీసులు, బయోమెట్రిక్ పరికరాల కొనుగోలులో భారీగా అక్రమాలు జరిగాయి.
- లేని సంస్థల నుంచి మందులు కొనుగోలు చేసినట్టు నకిలీ ఇండెంట్లు సృష్టించారు. ప్రభుత్వం రూ.89కోట్లు చెల్లిస్తే అందులో రేట్ కాంట్రాక్ట్‌లో ఉన్న సంస్థలకు రూ. 38కోట్లు చెల్లించారు. మిగతా రూ.51కోట్లను దారి మళ్లించారు.
- టెండర్లు లేకుండా నామినేషన్ కింద ఆర్డర్లు ఇవ్వడంతో కోట్లాది రూపాయల ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైంది.

అచ్చెన్నపై నమోదు చేసిన కేసులివే..

- అవినీతి నిరోధక శాఖలో పలు సెక్షన్ల కింద అచ్చెన్నాయుడిపై కేసులు నమోదు చేశారు. క్రైమ్ నంబర్ 04/ఆర్‌సీఓ- సీఐయూ- ఏసీబీ/2020 యు/ఎస్ 13(1), (సీ), (డీ), ఆర్/డబ్ల్యూ 13(2) ఏసీబీ పీసీ సవరణల చట్టం-2018, ఏసీబీలోని ఐపీసీ సెక్షన్ల ప్రకారం సెక్షన్ 408, సెక్షన్ 420, 120-బీ కింద అచ్చెన్నాయుడిపై అధికారులు కేసు నమోదు చేశారు.
- రూ. 975.79కోట్ల విలువైన మందులతో పాటు వైద్య పరికరాల కొనుగోలులో సుమారుగా రూ.150కోట్ల పైన అవినీతి అక్రమాలు జరిగినట్టు ఏసీబీ తేల్చింది.
- ఆస్పత్రులకు అవసరమైన మందులు, ఔషధాలు, వైద్య ఉపకరణాలు, ఆపరేషన్లకు అవసరమైన పరికరాలు, ల్యాబ్ కిట్స్, ఫర్నీచర్ పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. రూ. 975.79కోట్ల రూపాయల మేర కొనుగోలు జరిగాయి. అయితే ఈ ప్రక్రియలో యథేచ్ఛగా నియమాలు, మార్గదర్శకాలను ఉల్లంఘించారు.
- నిబంధనల ప్రకారం ఉండాల్సిన డ్రగ్ ప్రొక్యూర్‌మెంట్ కమిటీని కూడా ఏర్పాటు చేయలేదు. కొనుగోళ్ల ప్రక్రియలో ఎక్కడా ఓపెన్ టెండర్లు కూడా పిలవలేదు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడింది.



మొదటి నుంచీ అదే బాగోతం



రాష్ట్ర స్థాయిలోనే కాదు జిల్లాలో కూడా పెద్ద ఎత్తున అవినీతి జరిగింది. గ్రానైట్, ఇసుక కుంభకోణాలు, బీసీ కార్పొరేషన్ రుణాల్లో అక్రమాలు, సింగిల్ టెండర్ విధానంతో సొంత అన్నకు టెండర్లు కట్టబెట్టడం, ధాన్యం రవాణాకు వచ్చిన కోట్లాది రూపాయలు సొంత ఖాతాలకు మళ్లించుకోవడం, మినుముల కుంభకోణంతో కోట్ల రూపాయలు సొంత ఖాతాలకు మళ్లించుకోవడం, టెక్కలిలో సింగిల్ టెండర్ విధానంతో తన బినామీ లాడి శ్రీనివాసరావుకు ఆర్టీసీ టెండర్లు కట్టబెట్టడం, దివాకర్ ట్రావెల్స్‌కు అడ్డగోలుగా రవాణా లైసెన్సులు జారీ చేయడం వంటి ఆరోపణలను అచ్చెన్న మూటగట్టుకున్నారు.



పచ్చ పాపాలు-5

అవుట్ సోర్సింగ్ దందా

సాధారణంగా ఔట్ సోర్సింగ్ పోస్టులకు అవసరమైన అభ్యర్థులను సమకూర్చే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీని కలెక్టర్ నియమించాలి. జిల్లా స్థాయిలో నోటిఫికేషన్ ఇచ్చి, అర్హత గల ఏజెన్సీలు దరఖాస్తు చేస్తే, వాటిలో సరైనదేదో నిర్ధారణ చేసుకుని ఎంపిక చేస్తారు. కానీ గత ప్రభుత్వంలో టీడీపీ నేతలను ఏజెన్సీలుగా నియమించి దందా చేశారు. కింజరాపు అచ్చెన్నాయుడు అమరావతి స్థాయిలోనే ఏ శాఖకు, ఏ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ఉండాలి, ఆ ఏజెన్సీ ఎవరి చేతిలో ఉండాలన్నది ఫిక్స్ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతటితో ఆగలేదు. బినామీ ఏజెన్సీల ముసుగులో స్థానిక నేతలు చెలరేగి పోయి ఔట్ సోర్సింగ్ పోస్టులకు బేరసారాలు సాగించారు. ఒక్కో పోస్టును రూ. 2లక్షల నుంచి రూ. 3లక్షల వరకు అమ్ముకున్న దాఖలాలు ఉన్నాయి.

ప్రధాని మోదీ విధానాలపై పోరాడుతాం

- ఏఐఎఫ్‌టీయూ (న్యూ) నాయకులు

విజయనగరం టౌన్: భారతదేశ సహజ సంపదలను దేశ, విదేశీ కార్పొరేట్లకు దోచిపెట్టే విధంగా ప్రధాని మోదీ రూపొందిస్తున్న విధానాలపై పోరాడుతామని ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు బెహరా శంకరరావు, రెడ్డి నారాయణరావు అన్నారు. మే డే సందర్భంగా బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ, కార్పొరేట్ల సేవలో తరిస్తున్న బీజేపీ పాలకులు 12 గంటల పని విధానం ప్రవేశపెడుతున్నారని ఆరోపించారు. వ్యవసాయరంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేలా చేసిన మూడు సాగు చట్టాలను రైతులు తిప్పికొట్టారని చెప్పారు.

దేశ సందపను కాపాడేందుకు పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు ఎస్. అప్పలరాజురెడ్డి, అప్పలరాజు, సత్యారావు, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం..

నెల్లిమర్ల: నగర పంచాయతీలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మిమ్స్ ఆస్పత్రి వద్ద మిమ్స్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి మిరప నారాయణ సీఐటీయూ జెండా ఎగురవేశారు. కార్యక్రమాల్లో వివిధ సంఘాల నాయకులు, కార్మి కులు పాల్గొన్నారు.

దేవునల్తాడలో టీడీపీ గూండాగిరి



ఇరు పార్టీల నేతల మధ్య తోపులాట

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ గ్రామంలో బుధవారం టీడీపీ గూండాలు రెచ్చిపోయారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, పలాస ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై అనుచితంగా వ్యాఖ్యలు చేయడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు దీటుగా ప్రతిస్పందించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు సొదాల వెంకన్న మాట్లాడుతూ 'పదేళ్లుగా ఎంపీగా చేసిన మీరు ఏనాడైనా దేవునల్తాడ ప్రజల సంక్షేమం, రైతులకు సాగునీరు అందించడంతో చొరవ తీసుకున్నారా' అంటూ నిలదీశారు. ఈ మాటను టీడీపీ కార్యకర్తలు సహించలేకపోయారు. ఎంపీటీసీని నెట్టేశారు. దీంతో గ్రామస్తులంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా టీడీపీ గూండాలు ఆగలేదు. పిడిగుద్దులు గుద్దుతూ గలాటా సృష్టించారు. కానీ స్థానికులు వారి ఆటలను సాగనీయలేదు. మంత్రి గురించి మరో మాట తప్పుగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించడంతో ఎంపీ ప్రచారం కాన్వాయ్ పొల్లాడ వైపు పలాయనం చిత్తగించింది. తాము అనుకుంటే ఎంపీ రామ్మోహన్ నాయుడు ప్రచార కాన్వాయ్‌ని గ్రామంలోకి అడుగు పెట్టనీయకుండా ఆపగలమని, కానీ ప్రజాస్వామ్యాన్ని గౌరవించి తాము అలా చేయలేదని ఎంపీటీసీ వెంకన్న అన్నారు. తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును విమర్శిస్తే సహంచేది లేదని మండిపడ్డారు. 60 ఏళ్లు పాలించిన గౌతు కుటుంబం, 10 ఏళ్లు ఎంపీగా పని చేసిన రామ్మోహన్ నాయుడు ఏనాడైనా పలాస నియోజకవర్గాన్ని, దేవునల్తాడను అభివృద్ధి చేశారా అంటూ నిలదీశారు. ఓటు అడిగే హక్కు వీరికి లేదన్నారు.



దేవునల్తాడలో అలజడి సృష్టిస్తున్న టీడీపీ కార్యకర్తలు

'నేరుగా ఫిర్యాదు చేయవచ్చు'



పరిశీలకులు శేఖర్ విద్యార్థి

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాధారణ ఎన్నికలను జిల్లాలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు యంత్రాంగం కృషి చేస్తోందని శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు, సీనియర్ ఐఏఎస్ అధికారి శేఖర్ విద్యార్థి తెలిపారు. ఎన్నికల ఉల్లంఘనలకు సంబంధించి శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలోనే కాకుండా శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాలకు చెందిన ఫిర్యాదులను, అర్జీలను రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, సాధారణ ప్రజలు సమస్య తీవ్రతను బట్టి తనను నేరుగా కానీ, లేదా ఫోన్ ద్వారా గాని ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. శ్రీకాకుళం అరసవిల్లి మిల్లు జంక్షన్ వద్దనున్న సన్ రైస్ హోటల్‌లో తాను ప్రతిరోజు ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అందుబాటులో ఉంటానని, తనని నేరుగా కానీ లేదా 90329 23131కు నంబర్ ద్వారా సంప్రదించవచ్చని, అలాగే ఎన్నికల నిర్వహణలో లోటు పాట్లపై సూచనలు కూడా ఇవ్వవచ్చని శేఖర్ విద్యార్థి తెలిపారు.

టీడీపీ మేనిఫెస్టో బూటకం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: టీడీపీ, జనసేన విడుదల చేసిన మేనిఫెస్టో పెద్ద బూటకమని పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బూర్లె శ్రీనివాసరావు, గోగులు వరప్రసాదరావు అన్నారు. కొత్తూరులో బుధవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. చంద్రబాబు మేనిఫెస్టో అమలు చేయాలంటే కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కూడా చాలదన్నారు. సంక్షేమ పథకాలు పేరుతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాశనం చేస్తున్నారని చెప్పిన చంద్రబాబు.. ఈ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే ఆర్థిక వ్యవస్థను నాశనం చేయవా అని ప్రశ్నించారు.

సీఎం జగన్ విడుదల చేసిన మెనిఫెస్టోపై ప్రజలకు నమ్మకం ఉందన్నారు. పార్టీ నాయకులు, సర్పంచ్‌లు సాధుబాబు, ధర్మారావు, ఎం.చక్రపాణి, వి.సూర్యనారాయణ, నాగేంద్ర, రంజిత్ వెంకటరావు, జి.వాసు, జె.రామకృష్ణ, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

కొత్తూరు: మండలంలోని ప్రతి గ్రామంలోనూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని స్థానిక సీఐ ఆర్.వేణుగోపాలరావు కోరారు. మండలంలోని బలదలో బుధవారం రాత్రి ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో మద్యం, సారా అమ్మకాలు, రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్‌ఐ ఎం.ఎ.అహమ్మద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈఓలు

పాతపట్నం: విద్యార్థులు చిన్నతనం నుంచే సాంకేతిక విద్యను అలవర్చుకోవాలని పాతపట్నం ఎంఈఓ బి.శ్రీధర్ అన్నారు. పాతపట్నం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు సర్టిఫికెట్లను బుధవారం అందజేశారు. ఎంఈవో శ్రీధర్ మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఐటీ విభాగంలో ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారన్నారు. మీ-సేవ, టైపు, జిరాక్స్, కంప్యూటర్, జాబ్ వర్క్, ప్రింటర్ కేర్ సర్వీసెస్‌లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారన్నారు. ఈ కార్యక్రమంలో హిరమండలం, కొత్తూరు మండలాల ఎంఈఓలు కె.రాంబాబు, శ్రీనివాసరావు, ఎంఈఓ-2 సి.హెచ్.తిరుమలరావు, ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ



జేసీబీతో పునాదులు తీస్తున్న దృశ్యం

ఆమదాలవలస: పట్టణంలోని కొత్తవీధి సమీపంలో గల ప్రభుత్వ స్థలాన్ని పట్టణానికి చెందిన ఓ వ్యక్తి బుధవారం ఆక్రమణకు ప్రయత్నించారు. ఈ స్థలం పట్టణ సమాఖ్య భవన నిర్మాణానికి కేటాయించేందుకు స్పీకర్ తమ్మినేని సీతారాం గతంలో చర్యలు చేపట్టారు. సంబంధిత అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. స్థలం కేటాయింపులో జాప్యం జరగడంతో ఆక్రమణదారుడు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి, స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. జేసీబీతో ఆ స్థలాన్ని చదును చేసి, పునాదుల తవ్వేందుకు ప్రయత్నిస్తుండగా మున్సిపల్, సచివాలయ సిబ్బందికి స్థానికులు సమాచారం అందించారు. ఆయా శాఖల సిబ్బంది అక్కడికి చేరుకొని ఆక్రమణను అడ్డుకున్నారు. దీనిపై టీపీఎస్‌కు వివరణ కోరగా.. తాను ఎన్నికల విధుల్లో ఉన్నానన్నారు. పూర్తిగా పరిశీలించకుండా.. ఇప్పుడే ఏం చెప్పలేనని సమాధానం ఇచ్చారు.

పరిశీలకులకు ఫిర్యాదు చేయొచ్చు

- పాతపట్నం ఆర్వో అప్పారావు

పాతపట్నం: సార్వత్రిక ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు ప్రత్యేక పరిశీలకులను కేంద్ర ఎన్నికల కమిషన్ నియమించిందని పాతపట్నం నియోజకవర్గం ఆర్వో ఎం.అప్పారావు బుధవారం చెప్పారు. పాతపట్నం నియోజకవర్గం పరిధిలో పోటీ చేయనున్న అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికలకు సంబంధించి సందేహాలు, సలహాలు, ఏవైనా ఫిర్యాదులు ఉంటే పరిశీలకులడు జనరల్ అబ్జర్వర్, ఐఏఎస్ అధికారి సందీప్ కుమార్‌కు ఫోన్ 90324 23131 చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. శ్రీకాకుళంలోని అరసవల్లి రోడ్డు, ఇందిరా విజ్ఞాన్ భవనం దగ్గర, సన్ రైజ్ హోటల్‌లో సాయంత్రం 5 నుంచి 6 గంటల లోపు సంప్రదించవచ్చని, నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చని ఆర్వో చెప్పారు.

4 నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ఆమదాలవలస: నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వేసేవారు, ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు ఈ నెల 4వ తేదీ నుంచి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్యాలెట్ సేకరణ, ఓటింగ్‌కు సంబంధించిన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జేసీ, ఆమదాలవలస ఎన్నికల ఆర్వో ఎం.నవీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులకు హాజరయ్యే పీఓలు, ఏపీఓలు, మైక్రో అబ్జర్వర్లు, హోమ్ ఓటింగ్ పోలీస్ టీమ్, ఇతర టీమ్‌ల వద్ద ఈ నెల 4వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు బ్యాలెట్ ఓట్లు సేకరిస్తారని తెలిపారు. ఇతర పీఓలు, సెక్టార్ అధికారులు, ఇతర టీమ్‌లకు ఈ నెల 5వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసుకునేందుకు సదుపాయం కల్పించినట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది, ప్రైవేట్ డ్రైవర్లు, ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్లు, వీడియోగ్రాఫర్లు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఎక్స్ సర్వీస్‌మన్‌లు, తదితరులకు ఈ నెల 6వ తేదీన అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన గ్రామదేవత ఉత్సవాలు



ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

హిరమండలం: సుబలయ గ్రామంలో గత పది రోజులుగా జరుగుతున్న గ్రామదేవత నీలామణి అమ్మవారి 8వ వార్షికోత్సవ ఉత్సవాలు (పెద్ద పండగ) బుధవారంతో ముగిశాయి. ఈ పండగలు ప్రారంభం రోజున గ్రామ దేవతకు గ్రామంలోకి ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు గ్రామ దేవతను దేవరబుట్టలో కొలువుదీరారు. ఘటాలతో మహిళలు ఊరంతా మేళతాలతో ఊరేగించి అమ్మవారిని ఆలయానికి సాగనంపారు.

ఆలయంలో ముగ్రాటలతో చల్లదనం చేసి, మొక్కులు తీర్చుకున్నారు. పెద్దపండగ ముగింపు సందర్భంగా బంధువులు, స్నేహితులతో గ్రామం జనసంద్రంగా మారింది.

కార్మిక వర్గాల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

- మే డే వేడుకల్లో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



మేడే సందర్భంగా మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కార్మిక, బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక టౌన్ హాల్‌లో మేడే వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్మికులు, కర్షకులు, చిన్న, మధ్య తరగతి వర్గాల కోసం పని చేస్తున్న పార్టీ అని తెలిపారు. కులాలు, మతాలు, పార్టీలు, జెండాలు అని చూడకుండా నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. కార్మికుల అభ్యున్నతి కోసం, కర్షకుల బాగు కోసం తీసుకువచ్చిన పథకాలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, కళింగకోమటి సంఘం అధ్యక్షులు కోణార్క్ శ్రీను, అంబటి శ్రీనివాసరావు, గురుగుబెల్లి లోకనాథం వైఎస్సార్‌సీపీ ట్రేడ్‌యూనియన్ నాయకులు పాల్గొన్నారు.







బొబ్బిలిలో జన ప్రభంజనం

సైడ్‌లైట్స్

- సీఎం సభకు నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలంతా ఉదయం 9 గంటలకే వేదిక వద్దకు చేరుకున్నారు.
- సీఎం జగన్‌కు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు సతీమణి చిన్నమ్మలు, ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాల నాయుడు, కుటుంబ సభ్యులు హారతిచ్చి స్వాగతం పలికారు.
- బొబ్బిలి సిద్ధమా అంటూ మైక్‌ను తట్టినప్పుడు జనం హర్షం వ్యక్తంచేశారు.
- తాగునీరు అందించేందుకు జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జి శంబంగి శ్రీకాంత్, తెర్లాం ఇన్‌చార్జి సత్యనారాయణ, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బుజ్జి ప్రసాద్ స్వయంగా తాగునీటి బాటిళ్లను ప్రజలకు అందజేశారు.
- ఎండ వేడిమి వల్ల నాయకులు తక్కువ మందిని సీఎం ఎన్నికల సభకు తరలించాలనుకున్నారు. అయితే, మహిళలు మమ్మల్ని ఎందుకు తీసుకువెళ్లరంటూ వాదులాడి మరీ బయలు దేరడం విశేషం.
- వంగపండు ఉష వైఎస్సార్ సీపీ ప్రచార గీతాలను పాడుతూ నృత్యం చేస్తున్నప్పుడు స్థానిక యువత సెప్పులేశారు.
- జేసీఎస్ నియోజక వర్గ ఇన్‌చార్జి శంబంగి వేణుగోపాల నాయుడు ఆధ్వర్యంలో ఎండకు సొమ్మసిల్లిన వారిని పోలీసులు నీడలో చేర్చే ప్రయత్నం చేశారు. మరికొంతమందిని 108లో ఆస్పత్రికి తరలించారు.
- ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ ప్రసంగంలో ఫ్యాన్ గుర్తును చూపిస్తూ మనగుర్తు ఇదే అంటూ చెప్పినప్పుడు జనం ఫ్యాన్... ఫ్యాన్ అంటూ కేరింతలు కొట్టారు.


సీఎంకు హారతిచ్చి స్వాగతం పలుకుతున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి, కుటుంబ సభ్యులు


ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు





సీఎంకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు

జనం..జనం..జనం.. ఏ దారిలో చూసినా జనహోరే..ఏ రోడ్డులో చూసినా జన ప్రభంజనమే.. భగభగ మండుతున్న సూరీడును సైతం లెక్కచేయకుండా..ఎన్నికల ప్రచారానికి వచ్చిన అభిమాన నేతకు బొబ్బిలి వాసులు ఘనంగా స్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుంచి సభాస్థలి వరకు వేలాది మంది వెంట నడిచారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అభివాదం చేస్తూ ముందుకు సాగుతుంటే ఉప్పొంగిపోయారు. మేడే నాడు పాలకుడి రూపంలో మా కోసం కష్టపడే కార్మికుడు వచ్చాడంటూ మురిసిపోయారు. చంద్రబాబునాయుడు మోసపూరిత పాలన.. బూటకపు హామీలు, కుట్రలను వినిపిస్తుంటే నిజమేనంటూ చేతులెత్తి చెప్పారు. మీ కోసం.. మీ ప్రాంత అభివృద్ధి కోసం.. మీ కష్టసుఖాల్లో అండగా ఉండేందుకు బరిలో నిలిచిన మీ బీసీ నాయకులకు అండగా ఉండాలంటూ ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌ను పరిచయం చేసినప్పుడు చప్పట్లతో మద్దతు తెలిపారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపిస్తామని మాట ఇచ్చారు.

- సంక్షేమ సారథికి జనం జేజేలు
- పరిపాలనాదక్షుడికి జన నీరాజనం
- మండుటెండను లెక్క చేయని జనం
- అభిమాన నాయకుడి వెంట సాగిన జనప్రవాహం
- అధికారం కోసం అంతమొందించే చంద్రబాబు కుట్రలను వివరించిన జగన్

బొబ్బిలి/విజయనగరం/చీపురుపల్లి:

సార్వత్రిక ఎన్నికల సమరం సమీపిస్తున్న తరుణంలో బొబ్బిలి ప్రజలు జయహో జగన్ అంటూ గర్జించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బొబ్బిలికి బుధవారం వచ్చిన అభిమాన నేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నా వెరవకుండా.. జననేతకోసం రోడ్లపైనే వేచి ఉన్నారు. ముఖ్యమంత్రి ప్రసంగం ఆద్యంతం వింటూ ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. బొబ్బిలి పట్టణంలోని సంస్థానం ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ఉదయం 11.25 గంటలకు సీఎం చేరుకోగా..ఆయనతో పాటు రాష్ట్రవిద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి వచ్చారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడి కుటుంబసభ్యులు హారతులతో స్వాగతం పలికారు. ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీచైర్మన్, వైఎస్సార్ సీపీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు తదితరులు స్వాగతం పలికారు.


ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్రగా వచ్చిన వేళ అభిమానుల కేరింత

మార్మోగిన జగన్నినాదం..

హెలిప్యాడ్ నుంచి సభాస్థలి వైపు ముఖ్యమంత్రి కాన్వాయ్ వస్తున్నప్పుడు దారిపొడవునా జనం జేజేలు పలికారు. ముఖ్యమంత్రి బస్సులోనుంచి ప్రజలకు అభివాదం చేస్తున్నప్పుడు ప్రజల ఆనందానికి అవధుల్లేవు. దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల మేర ప్రయాణించిన బస్సుతో పాటు ప్రజలు ముందుకు సాగారు. కాలేజీ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా రైల్వేస్టేషన్ జంక్షన్, పాత కోర్టు కూడలి మీదుగా వస్తున్నప్పుడు దారి పొడవునా జనం జేజేలు పలికారు. జయజయ ధ్వానాలతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి కాన్వాయ్ వెంట ప్రజలు పరుగులెత్తారు. బస్సులో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఈ మార్గం గుండా వస్తున్నప్పుడు బొబ్బిలి రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. పోలీస్ స్టేషన్, శ్రీ కళాభారతి ఆడిటోరియం మీదుగా బహిరంగ సభా వేదిక ఉన్న లోకబంధు ఆడిటోరియం ప్రాంతానికి చేరుకున్నారు.

మీ వారే గెలిపించండి..

వైఎస్సార్‌సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడిని సీఎం పరిచయం చేస్తూ మీలో ఒకరు, మీ అందరి వాడు, నాకు తండ్రి సమానుడైన శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నను గెలిపించండి. మీకు మంచి చేస్తాడు అన్నప్పుడు సభికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను పరిచయం చేస్తూ మంచి వాడు, సౌమ్యుడు అయిన శేఖర్ అన్నను ఎంపీగా గెలిపించాలని కోరినప్పుడు జనం నుంచి అలాగేనంటూ చేతులెత్తి మద్దతు తెలిపారు.






బొబ్బిలి...సిద్ధమేనా..?

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ ప్రాంతంలో బస్సు వేదికపై నుంచి ప్రసంగం ప్రారంభించినప్పుడు ముందుగా ప్రజలనుద్దేశించి బొబ్బిలి సిద్ధమేనా అని అడిగినప్పుడు ప్రజానీకం అంతా ఎండను సైతం లెక్క చేయకుండా సిద్ధమేనంటూ బిగ్గరగా కేరింతలు కొట్టారు. ప్రసంగం ప్రారంభంలో మైక్‌ను తడుతూ పిలవడంతో జనం ప్రతిస్పందనకు ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. ఎండను సైతం లెక్క చేయకుండా మీరు వేచిచూడడం అభినందనీయమని సీఎం అన్నప్పుడు ప్రజలు స్వాగతించారు. 14 ఏళ్ల సీఎంగా చేసి ప్రజలకు ఒక్క మంచి పని చేయలేదని, రాజకీయ జీవితమంతా కుట్రలు, మోసాలు, వెన్నుపోటు పొడవడం, కుర్చీ లాక్కోవడమేనంటూ చంద్రబాబు నీచరాజకీయ చరితను సీఎం వివరించినప్పుడు నిజమేనంటూ జనం మద్దతు తెలిపారు.

తరలివచ్చిన నాయకులు

బొబ్బిలిలో జరిగిన సీఎం సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలసిల రఘురాం, మాజీ మంత్రి పెద్దింటి జగన్‌మోహన్‌రావు, బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు మావుడి శ్రీనివాసరావు, తూముల భాస్కరరావు, జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జి శంబంగి శ్రీకాంత్, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ పోల అజయ్, నియోజకవర్గ ఇన్‌చార్జి శంబంగివేణుగోపాలనాయుడు, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు తూముల రామసుధీర్, ఎంపీపీ శంబంగిలక్ష్మి, జెడ్పీటీసీ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు పలుకుతున్న అభిమానులు


రాష్ట్ర అభివృద్ధికోసం పనిచేస్తున్న అసలైన కార్మికుడు జగన్ అంటూ ప్లకార్డు ప్రదర్శిస్తున్న అభిమాని


జగన్‌ను చూసిన వేళ దివ్యాంగుడి ఆనందం


జగన్‌మామయ్యా అంటూ చిన్నారి కేరింత


దివ్యాంగుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న సీఎం


ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి బొబ్బిలి వీణను బహూకరిస్తున్న శంబంగి కుటుంబ సభ్యులు